# అమరావతి

వైభవ దేవేంద్రుడు, వాసిరెడ్డి వేంకటాద్రి ప్రభువు. కృష్ణకు యిద్దరి అద్దరి మాగాణం అంతా చెక్కు-చెదరని ధర్మ విక్రమంతో, ప్రజలకు తండ్రిగా, పెద్దలకు విధేయుడుగా, శాసనానికి తలవరిగా, శత్రువులకు చండశాసనుడుగా, ఏలుకుంటూన్న చల్లని హయాములో—

ఎల్లవేళలా, ఎండనక - నీడనక, విచ్చుకత్తులవారు, బరిసెలవారు, బల్లాల వారు, వీనుమిగిలిన వీర రాహుతులందరూ పచ్చెపువాళ్ళ బాదరబందీ, ఏ పరగణాకూ

సోకనీకుండా వేయి కన్నులుగా వేయికివేయి బాహువులుగా, పరాక్రమాల మెగులతూ ఉండగా—

సింగారం పొలిమేరల్లో, ఎన్ని తరాలుగానో ఊడపాదుకున్న మర్రి — నీడను ఏనాడో, తలపండిన తబిసి చిన్న పర్ణశాలలో, బుల్లి తులసీ బృందావనమయంగా, కృష్ణాజినంమీద, చిత్రాసనంమీద, దర్భాసనంమీద పద్మాసనంగా - పొద్దు పొడిచిం దెరుగక, సంజకమ్మిం దెరుగక అలా కదలని కాలూ, మూసిన కన్నుగా మనకు కాన రాని, అదేదో మగతలో ఉండిపోయినాడు.

చివరకు ఎన్నాళ్ళకో ఓనాడు, ఆ తబిసి గుండెల్లో, బొమముడిలో చిక్కిన వెలుగు పట్టపగ్గాలులేక, ఉబికి ఉబికి పండువెన్నెలై రెక్కలకు అందనిమేరకూ పులుగులు నేరని దూరాలకూ ఎగిసిపడి ఎగబాకి, ఆకాశగంగై వరాహస్వామి ఉద్ధ రించిన చేనంతా చిలకరించింది. తబిసి కన్ను తెరిచాడు.

తానై కన్ను తెరిచాడు; తనో మనిషి ననుకున్నాడు. తన్ను తా నెరిగినాక దగలున్నాయ్ దప్పికలున్నాయ్ - దాహమైంది తబిసికి. కమండలం ఉంది — ఉదకంలేదు.

ఎవరీ పనికిమాలిందని ఎలుగెత్తని మౌనం ఉరుములు పెట్టున గర్జించింది.

ఆమడదూరాన లేడల్లే పోతూన్న - నీడమనిషి ఒక్క చుట్టు తిరిగి, తబిసి ముందర గిరవాటుపడి, సొమ్మసిల్లబోతూ, నేనే అయ్యా, అని ఆ పాదాలకు మనవి చేసుకున్నాడు.

"నేనంటే"

"దొంగను."

"కావేమో!"

"నాకా అనుమానం లేదయ్యా!

పుట్టింది దొంగ కడుపున

పెరిగింది దొంగ ఒడుపున -

కాదంటే నాకు అవమానం కాదయ్యా!

అది మీ అజ్ఞానం—"

తబిసి, కనపడని కదలికతో, కనురెప్పతో రవంతగా, ఆ పలుకులకూ మ్రొక్కాడు—

"శపించనా!"

"కూడదయ్యా! చేసిన తపసంతా, నా పాపంమీద కత్తి పదునుగా ధార పోస్తారా!

"శిక్షించే వరం-ఏ మహారాజు వరమో చేయండి." నీడ వెలుగులో మాయమై పోయింది.

పిండారీ మూకలు, దేశం గగ్గోలు చేస్తున్నాయ్. పరగణా అంతటా ఒకటే నరుకుల - వేట్లాట. మన్నె సుల్తానుకు ఈ బెడద చెవి సోకనీకుండా, ప్రజలే, ఏ వాడకు ఆ వాడను, ఏ సీమకు ఆ సీమను కాచుకుంటున్నారు.

సంకురాతిరి పండుగపూట, తెల్లవారకముందే వేంకటాద్రి ప్రభువు కృష్ణలో స్నానంచేస్తూ ఉన్నపాటున ఉండి, ఉలికిపాటుగా "పట్టింది తాతగారూ!" అని, ధైర్యం గానే కేక వేశారు!

అల్లంత దూరాన జపం చేసుకుంటున్నారు - పాపయారాధ్యులవారు. వారు అరగన్నుగానే, "దేశానికా, నీకా, నాయనా!" అని తనలో తాను అనుకున్నారు.

పట్టింది మొసలే అయితే, ఆ మెలుకువ తెలుసును నాయుడికి. ఆ వేటలో తరతరాలుగా మొనగాడాయెను. కాని ఆ పట్టు మొసలి పట్టుకాదు. ఆ ఒడుపు మొసలి ఒడుపు కాదు. కాలు కరకర మనలేదు. నీరు కందలేదు.

పట్టిన దొంగ పాదం విడిచి ఉవ్వెత్తున నిలుచున్నాడు.

"ఎవరవయ్యా!" అన్నారు ప్రభువులు.

"బతిమాలేందుకు, పాదం పట్టిన వాడినయ్యా! తల్లి కడుపున తారసిల్లాం - దానం చేయవయ్యా—దయా, జాలీ, అచేత, ఈచేత ధారపోయవయ్యా తండ్రీ!"

పాపయారాధ్యులు - సందడిగా చేరువకు వస్తున్నారు - వస్తూనే సెలవిస్తు న్నారు - "మరి, పలువిప్పకు మొనగాడా!

అర్థమయ్యేట్టు చెప్పేవుసుమీ! ప్రభువులకు పాపభీతి బలిసి, పుణ్యానికి వేసగి వచ్చింది"

వేంకటాద్రినాయుడు తన మనసు ధారాదత్తం చేశాడు. దొంగ ఒక్క మునకతో ఏటిపాలై పోయినాడు.

వేటలో పట్టి తెచ్చిన మృగాలను వేడుక చూపించడం ప్రభువులకు అలవాటు. పిండారిమూకను పట్టి తెచ్చారని పరగణా అంతటా ఒక్క చిటికెలో సాటింపు అయింది. తిరునాళ్ళకు వచ్చింది ప్రజ—

ఒక్క బారున ఒకే వెన్ను విరుపున చింతలతోపులో ఉంది పిండారిమూక. అటునుంచి నరుక్కు వస్తున్నాయ్ విచ్చుకత్తులు. ఇటునుంచి నరుక్కుపోతున్నాయ్ పట్టాకత్తులు. తలలన్నీ రాలినాయ్. ఒక్క తల మిగిలింది. అక్కడ అన్ని కత్తులూ ఆగినాయ్.

ఆ తల ఝళికింది. ఆ కళ్ళు కత్తులు సానబెట్టినాయ్. కాని, ఏ చెయ్యీ ఆడ లేదు! ఏ అడుగూ ఆడలేదు!

"నాయనా!" అన్నది గొంతు.

కన్నెదుట పిలిచేది, ఆ దొంగ పిలుస్తూన్నది - పాపయారాధ్యులు.

"ఆఁ" అన్నాడు నాయుడు.

చేత కత్తి అందుకుని, ఓరగా చేరువయినాడు.

"ఏం ప్రభూ! దానం పట్టినవాడు ఈ వరం మీ పరం చేస్తున్నాడు. ఒక్కటే విసురు!"

ప్రభువు ఇంకా జంకుమీదే ఉన్నాడు.

"నీవు పిండారీవా!"

"కాను! అంతకన్న గండడిని. ఏం అయ్యా! ఎన్నిసార్లో పట్టి తెప్పించావు పిండారిమూకను. ఎందరినో నరికించావు కాని, ఎప్పటికప్పుడే జాలిపడి అటునుంచి నరికించి ఇటు విడిచావు; ఇటునుంచి నరికించి అటు విడిచావు. నీది దయ అనుకున్నావ్. అంతకే ధర్మమనుకున్నావ్. నీ జాలి మాకు చేటుకానా? మీ ధర్మం

పరగాకు ఆపదకానా? మాటికి మాటికి మంటలు ఆర్పావే కాని, చిటిలే రవ్వల్ని ఏం చేశావ్! ఇక చాలించయ్యా! నీకు ప్రజలకన్న దైవముందా? మా మేలుకన్నా పూజ ఉందా? - ఏలే ప్రభువుకు ఎవరు వంకబెడతారు? ఎదుటపడి, ఎవరు తప్పు దిద్దుతారు? నే నొక్కణ్ణే!

ఏలేవారి తప్పు నా తప్పుగాదా అనుకున్నా!

ఎన్ని పుటకలుగానో పరగణాలో దోచుకు బతికేందుకు హక్కు మాకు ఉంది. పచ్చగాఉన్నా దోచుకుంటే అందంకాని, అల్లాడిపోయే ప్రజను చూస్తే గుండె తరుక్కుపోయింది. ఆటూ చేయిపోలా, నా ధరమంమీద మనసూ పోలా.

చలిదన్నా ముట్టకుండా యిటు పడివచ్చా! మర్రిక్రింద ఓ అయ్య ముక్కు మూసుకుని ఉంటే సొరబుర్రలో నీరు కాసిని పుక్కిటపట్టినా! ఆ అయ్య కన్ను తెరిపించి కసిరించుకున్నా. ఒక్క ఉరకనువచ్చి నీ పాదం పట్టినా — దానం పట్టినా దండులో కలిసి కాళ్ళ బందామల్లే ఎటూ మెసలనీకుండా — మీచేత పట్టించినా.

నరికిన పుణ్యం మీదేగాని, నరికించిన పంపా నా కెందుకూ-విసురు!—"

నాయుడు ఆ కత్తితోనే ఆ చేతు లలా జోడించి "అమరేశ్వరా!" అన్నారు తగని జాలిగా.

"విసురు!"

విసురన్నమాట విసురున, కత్తి చళుకుమనడ మేమిటి, ఆ తల ఎగిరిపడడ మేమిటి!

తలలేని మొండెం తపసులో ఉన్నట్టు పద్మాసనం వేసింది - తడువుకోకుండా వచ్చి, జీవంతోవున్న వేలు ప్రభువు నొష్టను తిలకం అద్దింది, నెత్తురు జీరతో.

ఆ దొంగ అచోకిలేదు. అచోటి కిప్పుడు ఆనవాలు లేదు; ఆ కథా కమామీషూ నిన్నా మొన్నా పుట్టిన వాళ్ళకు ఎరికేలేదు!

నాయుడిపేరు శిలాక్షరంగా ఉంది! ఆ ప్రభువు ధర్మం నూటొక్క గుడిలో దివ్వై వెలుగుతూంది - ఎవరి తపసో నిలిచింది. ఎలాగో వెలిసింది అమరావతి.